సాక్షి నిర్మల్

గురువారం • 21 • ఆగస్టు • 2025



పర్యావరణహితాయ..

గణేశ్ నవరాత్రోత్సవాల కోసం వినాయక ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. మట్టి విగ్రహాలకు ఆదరణ పెరుగుతుండగా వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి. 8లో ▸



రాజీవ్ సేవలు మరువలేనివి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై స్పందించాలి



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జానకీ షర్మిల

నిర్మల్ టౌన్: ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన కీలక సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని, పోక్సో కేసుల్లో వీలైనంత త్వరగా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు అనుమతి కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని, అనుమతిపత్రం, క్యూఆర్ కోడ్‌ను మండపం వద్ద తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భైంసా, నిర్మల్ ఏఎస్పీలు అవినాష్, రాజేశ్‌మీనా, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

ఎరువుల కేంద్రం పరిశీలన



ఆరా తీస్తున్న సాంకేత్‌కుమార్, అవినాష్‌కుమార్

భైంసాటౌన్: పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, ఏఎస్పీ అవినాష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. నిల్వలు, అమ్మకం వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా డిమాండ్ మేరకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టనివ్వొద్దని భైంసా ఏడీఏ వీణ, ఏవో గణేశ్‌కు సూచించారు.

'అగ్రి' ఇన్‌పుట్స్ పంపిణీ



నీమ్ ఆయిల్ పంపిణీ చేస్తున్న రవికుమార్

కడెం: మండలంలోని ఉడుంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మారుమూల ఇస్లాంపూర్, మిద్దెచింత గిరిజనులకు ఆర్పీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.1.50లక్షల విలువైన అగ్రికల్చర్ ఇన్‌పుట్స్‌ను ఉచితంగా పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధి జి.రవికుమార్ తెలిపారు. 150మంది రైతులకు నీమ్ ఆయిల్, ట్రాప్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆర్పీజీ సిబ్బంది అనిల్, రంజిత్, వెంకటేశ్, జైసాగర్, ఇస్లాంపూర్ మాజీ సర్పంచ్ కనకపద్మ, జైతు, మాణిక్‌రావు తదితరులున్నారు.

శోభాయాత్ర మార్గం పరిశీలన



రూట్ పరిశీలిస్తున్న అధికారులు

భైంసాటౌన్: గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో కలిసి రోడ్లపై గుంతలు, ఇతర అంశాలు అడిగి తెలుసుకున్నారు. శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



61వ జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

సార్పూర్ (జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జింతూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లికి సోయా పొట్టుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచాయి. సమాచారం అందుకున్న ఎస్సై గణేశ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. జేసీబీతో లారీని పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు.

కోటా పెరిగింది!



జిల్లా కేంద్రంలోని రేషన్‌షాపు ఎదుట బారులుదీరిన లబ్ధిదారులు (ఫైల్)

- జిల్లాలో 22,233 కొత్త కార్డులు
- సెప్టెంబర్ నుంచి సన్నబియ్యం
- లబ్ధిదారులకు చేతిసంచి ఉచితం
- ఫలించబోతున్న పదకొండేళ్ల కల

నిర్మల్ చైన్‌గేట్: రేషన్ కార్డుల కోసం 11ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరింది. జూలై 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాలో లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా కార్డులు అందించారు. దీంతో వారి మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కార్డుదారులకు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీకి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జూన్‌లో మూడు నెలల రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేశారు. దీంతోపాటు మూడు నెలలుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీతోపాటు ఉన్న కార్డుల్లో సభ్యుల పేర్లు నమోదు చేసింది. జిల్లాలో పెరిగిన ఆహారభద్రత కార్డుల్లోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సన్నబియ్యం పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అదనంగా 328 మెట్రిక్ టన్నులు

కొత్త రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి యథావిధిగా పాత కార్డులతోపాటు కొత్త కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు సెప్టెంబర్ కోటాకు సంబంధించిన సన్నబియ్యం కేటాయించారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపునకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చౌకధరల దుకాణాలు, మండలస్థాయి గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యానికి తోడు అదనంగా కావాల్సిన కోటాను సరఫరా చేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి ముందు ప్రతినెలా సుమారు 412 షాపుల ద్వారా 2,19,972 కార్డులకు 4,428 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. పెరిగిన లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా ప్రస్తుతం అదనంగా జిల్లాకు 328 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

నాలుగు ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా

నిర్మల్, ముధోల్, భైంసా, ఖానాపూర్ ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి 18మండలాల్లోని 412రేషన్‌షాపులకు బియ్యం కోటా చేరనుంది. స్టేజ్-1 గోదాముల నుంచి ఇప్పటికే ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం నిల్వల రాక ప్రారంభమైంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి నేరుగా రేషన్‌షాపులకు బియ్యం పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లా రేషన్ సమాచారం

పాత కార్డులు	2,19,972
యూనిట్లు	7,03,796
కొత్త కార్డులు	22,233
కొత్త యూనిట్లు	50,727
మొత్తం కార్డులు	2,42,205
మొత్తం యూనిట్లు	7,54,523
గత కోటా	4,428 మెట్రిక్ టన్నులు
పెరిగిన కోటా	328 మెట్రిక్ టన్నులు
సెప్టెంబర్ కోటా	4,756 మెట్రిక్ టన్నులు

ఉచితంగా చేతిసంచి..

తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా రేషన్‌తోపాటు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పర్యావరణహితమైన చేతిసంచిని ఈ నెల కోటాతో అందజేయనుంది. తెల్లటి రంగులో ఉన్న ఈ బ్యాగుపైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటోలు ముద్రించి మధ్యలో ఇందిరమ్మ అభయహస్తం పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలు ముద్రించారు. బస్తాపై 'అందరికీ సన్నబియ్యం ప్రజాప్రభుత్వంతోనే సాధ్యం' అనే నినాదాన్ని ప్రింట్ చేశారు. రూ.50 విలువ చేసే ఈ బ్యాగును ఉచితంగా సన్నబియ్యంతో పాటు లబ్ధిదారులకు అందజేస్తారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం కోసం ప్రచార అస్త్రంగా కూడా ఇది ఉపయోగపడనుంది. కాగా, బియ్యంతోపాటు అప్పట్లో ఇచ్చిన తరహాలో కందిపప్పు, చింతపండు, ఉప్పు, నూనె, పసుపు, గోధుమలు, చక్కెర తదితర సరుకులివ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, వేదికపై ఎస్పీ జానకీ షర్మిల, అధికారులు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- కలెక్టరేట్‌లో శాంతికమిటీ సమావేశం

నిర్మల్: జిల్లాలో గణేశ్ నవరాత్రోత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణపై హిందూ, ముస్లిం ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రోత్సవాలు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలవాలని సూచించారు. ఇతరుల ఆచార, సంప్రదాయాలకు భంగం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపనలు మొదలు నిమజ్జనం వరకు అన్ని కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా చూడాలని సూచించారు. జిల్లా, డివిజన్ స్థాయిలో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో రూట్‌ల వారీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని, శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. నిమజ్జనం జరిగే రూట్లలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, రహదారులు సక్రమంగా ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట క్రేన్లు సిద్ధం చేయాలని సూచించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో నిమజ్జన ప్రాంతాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పకడ్బందీ చర్యలు : ఎస్పీ

గణేశ్ నవరాత్రోత్సవాల సందర్భంగా శాంతిభద్రతల విషయంలో పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద ప్రత్యేక బందోబస్తు కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఉత్సవాలు సాఫీగా సాగేలా ప్రజలంతా సకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్‌కుమార్, ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేశ్ మీనా, భైంసా సబ్‌కలెక్టర్ సాంకేత్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేదు

సోన్: జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేదని కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం, ఎరువులు, విత్తనాల షాపులను ఎస్పీ జానకీషర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా, డీఏపీ రైతులకు సరిపడా ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకే ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతీ షాపు ఎదుట ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని షాపుల నిర్వాహకులను.. ఎరువుల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులను ఆదేశించారు. నానో యూరియా, నానో డీఏపీని కూడా వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ సోన్ గోదావరి పుష్కర ఘాట్‌ను పరిశీలించారు. వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ గణేశ్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పంట నష్టం సర్వే త్వరగా పూర్తి చేసి నివేదికలు పంపించాలని ఆదేశించారు. ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, తహసీల్దార్, ఎంపీడీవో సురేశ్, మల్లేశ్, సీఐ గోవర్ధన్‌రెడ్డి ఎస్సై గోపి, ఏవో వినోద్‌కుమార్ ఉన్నారు.

‘ఉపకార’ంతో ఊతం

- ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు వరం
- నాలుగేళ్లు అందనున్న కేంద్ర సాయం
- ఏటా రూ.12వేల చొప్పున మంజూరు
- ఈ నెల 31 వరకు దరఖాస్తు గడువు



నిర్మల్ చైన్‌గేట్: ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే పేదవిద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువు ఆపాలనుకునేవారికి ఉపకార వేతనాలు అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది. ఇందుకోసం 2008లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)ను అమలులోకి తెచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. పరీక్ష నిర్వహించి అర్హత సాధించినవారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి చేసేదాకా నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ మంజూరు చేయనుంది. ఎంపికైన విద్యార్థులు ప్రతీ సంవత్సరం ఉపకార వేతనం కోసం వివరాలు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. స్కాలర్‌షిప్ డబ్బులు నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నాయి.

నవంబర్‌లో ప్రతిభ పరీక్ష

ఈ నెల 31వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా చొరవ చూపాలని విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 పరీక్ష ఫీజుగా నిర్ణయించారు. అయితే.. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ఉపాధ్యాయులే ఫీజు చెల్లించి పోటీ పరీక్షకు సన్నద్ధం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ ఏడాది నవంబర్‌లో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తుకు అర్హతలు

ఉపకార వేతనానికి అర్హత సాధించేందుకు ప్రతిభ పరీక్ష రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునేందుకు మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఏడో తరగతిలో కనీసం 55శాతం మార్కులు సాధించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5శాతం మార్కుల సడలింపు ఉంటుంది. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించి ఉండకూడదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫాం జిరాక్స్ కాపీతోపాటు ఏడోతరగతిలో పొందిన మార్కుల జాబితా, ఆదాయ, కుల ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలను ఈనెల 31న డీఈవో కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా..

కేంద్ర విద్యాశాఖ ఏటా ఈ పరీక్షను దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రధానంగా మెంటల్ ఎబిలిటీ 30మార్కులు, మల్టీపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలుంటాయి. స్కాలస్టిక్ ఎబిలిటీ పరీక్ష 90 మార్కులు, 7వ, 8వ తరగతుల సైన్స్, గణితం, సాంఘికశాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలుంటాయి. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు. ముఖ్యంగా జిల్లా యూనిట్‌గా, కేటగిరీల వారీగా, ప్రతిభ కొలమానంగా అర్హుల ఎంపిక ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



గడువులోపు దరఖాస్తు చేసుకుని ప్రతిభ పరీక్ష రాస్తే మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైతే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యేదాకా నాలుగేళ్లపాటు రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పరమేశ్వర్, ఇన్‌చార్జి డీఈవో

సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

ఖానాపూర్: రైతాంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ ప్రభాకర్ ఆరోపించారు. మండలంలోని అడవిసారంగాపూర్ గ్రామంలో ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంకుష్‌రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రథమ మహాసభకు హాజరై మాట్లాడారు. రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభ ప్రారంభానికి ముందు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షుడు నందిరామయ్య ఏఐయూకేఎస్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి కట్ల రాజన్న, నాయకులు జక్కుల రాజన్న, అడ్డగట్ల శంకర్, ఎల్లయ్య, గోరేబాయ్, సుదర్శన్, మహేందర్, చాంద్‌పాషా, రాజన్న, శ్రీనివాస్, భీంరావు, లింగు, లచ్చన్న, సంజీవ్, రాజేశ్వర్ తదితరులున్నారు.

'గడ్డెన్నవాగు' నీటి విడుదల

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారంఎగువ నుంచి 1,127 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అధికారులు ఒక గేటు ఎత్తి దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.60 మీటర్ల నీరు ఉంది.

'కడెం'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 6,381 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక వరద గేటు ఎత్తి 3,596 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.475 అడుగుల నీటిమట్టం ఉంది.

సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయాలి

నిర్మల్ టౌన్: బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేపట్టనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఘర్షణ పద్ధతిలో కాకుండా ప్రత్యామ్నాయ పద్ధతి ఆలోచించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రిజర్వేషన్లు అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అధికార కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జిల్లా నుంచి అధికసంఖ్యలో బీసీలంతా సత్యాగ్రహ దీక్షకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్, అధికార ప్రతినిధి జుట్టు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఉగ్రరూపం



పీచర పుష్కరఘాట్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి

లక్ష్మణచాంద: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండటంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బుధవారం మండలంలోని గోదావరి పరీవాహక గ్రామాలైన పీచర, ధర్మారం, చింతల్‌చాంద, మునిపెల్లి, పార్‌పెల్లి వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తిలకించేందుకు ప్రజలు గోదావరి వద్దకు వస్తున్నారు.

అరచేతిలోనే పల్లె పద్దు

- నిధుల సమాచారానికి ప్రత్యేక యాప్
- 'మేరీ పంచాయత్' పేరిట ఏర్పాటు



'మేరీ పంచాయత్' యాప్

నిర్మల్‌ఖిల్లా: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాలకు ఆర్థికసంఘం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా విడుదలైన నిధులు, పథకాల వారీగా వ్యయం వివరాలను ప్రజల ముంగిటకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 'మేరీపంచాయత్' పేరిట ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే పనులను అడ్డుకునేలా చొరవ చూపింది. ఈ యాప్ ద్వారా పంచాయతీ సమగ్ర సమాచారం తెలుసుకునే మార్గాన్ని సులభతరం చేసింది. యాప్‌లో ప్రతీ లెక్క పక్కాగా పొందుపరిచి ఉంటుంది.

తప్పుడు గణాంకాలు లేకుండా..

గ్రామపంచాయతీ నిధులు, చేపట్టిన పనుల వివరాలు.. వార్డులవారీగా ఫొటోలతో సహా ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆర్థిక సంఘం ఎన్ని నిధులు విడుదల చేసింది.. ఇంకా ఎన్ని నిధులు రావాల్సి ఉంది.. ఇందులో తెలిసిపోతుంది. గ్రామపంచాయతీ పాలకవర్గాలు కూడా పొరపాట్లకు తావివ్వకుండా ప్రతీ పైసాను లెక్క ప్రకారం ఖర్చు చేసే అవకాశముంటుంది. పంచాయతీ కార్యదర్శి నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల వరకు ఎవరు తప్పుడు నివేదికలు చూపినా పౌరులు ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టవచ్చు.

ఎలా లాగిన్ అవ్వాలంటే..

ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో ప్లేస్టోర్‌లో 'మేరీపంచాయత్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిని ఓపెన్ చేస్తే మొదటి పేజీలో పేరు, మొబైల్ నంబర్ వివరాలతో లాగిన్ కావాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం తదితర వివరాలు నమోదు చేయాలి. వాటిని ఎంపిక చేసుకున్న తర్వాత క్లిక్ చేస్తే ఆ గ్రామానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలు, నిధుల పూర్తి సమాచారం వార్డులవారీగా నమోదై ఉంటుంది. జిల్లాలో 19 మండలాలుండగా ఇందులో ఒక అర్బన్ మండలం ఉంది. 18 మండలాల్లోని 400 గ్రామాల పరిధిలో 3,368 వార్డులున్నాయి.

పారదర్శకత కోసమే..

ప్రతీ గ్రామపంచాయతీకి సంబంధించిన అభివృద్ధి పనుల ఆర్థిక పురోగతి, ఆస్తులు జియో ట్యాగింగ్ ద్వారా ఈ యాప్‌లో నిక్షిప్తమై ఉంటాయి. వీటిని పొందుపరచాల్సిన బాధ్యత పంచాయతీరాజ్ శాఖదే. గ్రామపంచాయతీ పాలక వర్గాల పేర్లతో సహా వివరాలు, పంచాయతీ కార్యదర్శి వివరాలు, మంజూరైన నిధులు, ఏయే పనులకు ఎంత వ్యయం చేశారు? ఆ పనుల ప్రస్తుత పురోగతి? తదితర అంశాలూ అందుబాటులో ఉంటాయి. అంచనా వ్యయాలు, అభివృద్ధి పనుల నివేదికలు ఇందులో క్లుప్తంగా పొందుపరిచి ఉంటాయి. జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తించడంతో ఒకసారి చేసిన పనులకు మరోసారి బడ్జెట్ కేటాయించడానికి అవకాశం ఉండదు. తద్వారా నిధుల వినియోగంలో పారదర్శకత ఎక్కువగా ఉంటుంది.

పర్యావరణహితాయ..
పార్వతి తనయా

- మట్టి వినాయకులకు పెరుగుతున్న ప్రాధాన్యత
- విభిన్న ఆకృతుల్లో దర్శనమిస్తున్న లంబోదరుడు
- ఉపాధి పొందుతున్న పలువురు కళాకారులు

ఆదిలాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలకు గణనాథుని ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రం వ్యాప్తంగా మట్టి ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. ఎంతోమంది కళాకారులకు ఉపాధి అందిస్తున్నాయి. వైవిధ్యమైన రూపాల్లో పార్వతి తనయున్ని పర్యావరణహితంగా ప్రతిష్ఠించేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి మట్టి వినాయక ప్రతిమలను నిలబెట్టేందుకు యువత, ఉత్సవ సమితి సభ్యులు ప్రాధాన్యతనిస్తుండడం విశేషం. పీఓపీ విగ్రహాలు తక్కువ సమయంలో పూర్తవుతాయి. మట్టి ప్రతిమల తయారీకి 10 నుంచి 20 రోజులు పడుతుంది. అయినప్పటికీ నిర్వాహకులు వైవిధ్యమైన రూపాల్లో మట్టి వినాయకున్ని కొలువుదీర్చేందుకు ఆర్డర్లు ఇస్తుండడం గమనార్హం. దీంతో కళాకారులకు చేతినిండా పని దొరుకుతోంది. మరోవైపు పర్యావరణ పరిరక్షణ సైతం సాధ్యమవుతుండడంతో పర్యావరణ ప్రేమికుల నుంచి సైతం హర్షం వ్యక్తం అవుతుంది.



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

ఆదరణ పెరిగింది



గతంతో పోలిస్తే పీఓపీ విగ్రహాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వైవిధ్యమైన ప్రతిమలు తయారు చేయాలంటే మట్టితో మాత్రమే సాధ్యమవుతుంది. దీంతో మట్టి వినాయక విగ్రహాలకు ఆదరణ పెరిగింది. మట్టి ప్రతిమలు తయారు చేసేందుకు 10 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. ముందుగానే ఆర్డర్ ఇస్తే మరిన్ని ప్రతిమలు తయారు చేసే అవకాశం ఉంటుంది.

– ఎగిడి రవి కుమార్, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్

నల్లమట్టి దొరకడం లేదు..



పది సంవత్సరాల వయస్సు నుంచే విగ్రహాల తయారీలో పాల్గొంటున్నా. నేను ఉద్యోగం చేస్తూనే.. మా కులవృత్తిని కాపాడుకునేందుకు విగ్రహ తయారీని కొనసాగిస్తున్నా. గతంలో స్థానికంగానే దొరికే నల్లమట్టితో విగ్రహాలను తీర్చిదిద్దే వాళ్ళం. అయితే ఇప్పుడు నల్ల మట్టి కరువైపోయింది. స్థానికంగా దొరకడం లేదు. దీంతో మహారాష్ట్రలోని అమరావతి నుంచి మట్టిని కొనుగోలు చేస్తున్నాం. – ప్రశాంత్ కుమార్, విగ్రహ కళాకారుడు

విగ్రహాల తయారీలో నిమగ్నం



మట్టితో తయారు చేస్తున్న వినాయకుడు

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక చవితి సమీపిస్తుండడంతో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. పట్టణంలోని పెట్రోల్‌పంప్ ఏరియా, మార్కెట్, మండలంలోని నజ్రుల్‌నగర్, రాంనగర్, విలేజ్‌నెం 5, చింతగూడ గ్రామాల్లో మట్టి వినాయకుల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి



చిన్ననాటి నుంచే విగ్రహాల తయారీపై ఆసక్తితో చిన్నచిన్న గణపతులను తయారు చేసి ఇంట్లో పూజించేవాళ్ళం. 23 సంవత్సరాలుగా వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నా. భక్తులను ఆకర్షించేలా వివిధ డిజైన్లలో, హనుమంతుడిపై వినాయకుడు, రామసేతు వినాయకుడులాంటి రూపాల్లో బంకమట్టి, సహజ సిద్ధమైన రంగులతో 5 నుంచి 20 ఫీట్ల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నా. ఈ ఏడాది ఇందిరా మార్కెట్ భారీ వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నా.

– గౌత్రే విక్రమ్, కళాకారుడు, కాగజ్‌నగర్

పర్యావరణ పరిరక్షణకు..



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను తయారు చేస్తున్నా. వినాయకుడి విగ్రహాలతో పాటు దుర్గాదేవి విగ్రహాలను కూడా తయారు చేస్తా. పదోతరగతి తర్వాత మట్టి విగ్రహాలను ఇంట్లో తయారు చేసేవాడిని. ఇప్పుడు 12 ఫీట్ల వరకు వినాయ విగ్రహాలను తయారు చేస్తున్నా. పట్టణంలోని త్రినేత్ర శివాలయంలో వినాయక విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్టిస్తాం

– ములుకుట్ల జశ్వంత్, ఆదర్శనగర్, కళాకారుడు

వారసత్వం కొనసాగిస్తున్నాం..



సంప్రదాయ బద్ధంగా తాతలు నేర్పిన కళను ముందుకు తీసుకెళ్తున్నాం. సాధారణ రోజుల్లో ఉద్యోగాలు చేసుకుంటూ, ప్రత్యేక పర్వదినాల సమయంలో విగ్రహాల తయారీ చేపడుతున్నాం. నిర్మల్ ప్రాంతంలో మావారు కొయ్య బొమ్మలు తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో మేము ఎక్కువగా వినాయకచవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాల సమయంలో, బోనాల సమయంలో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– చంద్రశేఖర్, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్

కళాకారులను ఆదుకోవాలి



సీజన్ సమయంలో మాత్రమే ఉపాధి దొరుకుతుంది. దీంతో మాలాంటి కళాకారులంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మాలాంటి కళాకారులపై దృష్టి సారించాలి. ప్రోత్సాహకాలను అందించడంతోపాటు, ఏవైనా వైద్య పరమైన అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అండగా నిలబడాలి. ప్రస్తుతం నేను 54 అడుగుల విగ్రహాన్ని తయారు చేస్తున్నా. విగ్రహాల ఎత్తు పెరుగుతుంది తప్పితే మా జీవితాల్లో మాత్రం ఎదుగుదల కనిపించడం లేదు.

– ఊరే గణేశ్, విగ్రహ కళాకారుడు

నిర్మల్‌లో పదేళ్లుగా...



మట్టి వినాయకుడి తయారీలో కళాకారుడు గోపి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణం గతం నుంచీ మట్టి గణపతుల తయారీకి ప్రసిద్ధి గాంచింది. జిల్లా కేంద్రానికి చెందిన కోటగిరి గోపి పదేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. అతని కుమార్తె మంజుశ్రీ తయారైన మట్టి విగ్రహాలకు డిజైనింగ్ చేస్తుంది. కుమారుడు గణిత్ వారికి సహాయపడుతుంటాడు. సుమారు 30 విగ్రహాలను తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేస్తుంటారు. ఇవి మూడు ఫీట్ల నుంచి ఏడు ఫీట్ల వరకు ఉంటాయి. మట్టి గణపతుల తయారీలో చెరువుల నుంచి తెచ్చిన బంకమట్టి, ఎండిన వరిగడ్డి, తవుడు, ఊబక, కట్టెపొడి, వెదురు బొంగులు వాడుతున్నారు. ఇవన్నీ పర్యావరణహితమని చెబుతున్నారు. వీటిని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేసినప్పుడు ఇవన్నీ తేలికగా నీటిలో కరిగిపోతాయి. డిజైన్, సైజ్ ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు ఉన్నాయి.

వినాయకుడు అంటేనే ప్రకృతి..



హిందూ సంప్రదాయం ప్రకారం మట్టి గణపతినే పూజించాలి. గణపతి పూజ అంటే ప్రకృతికి పూజ అని అర్థం. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ అఫ్ పారిస్ గణపతులతో వాతావరణం కలుషితం అవుతుంది. కాబట్టి మన ధర్మాన్ని మనం పాటించాలి.

– కోటగిరి గోపి, విగ్రహ కళాకారుడు, నిర్మల్

మట్టి మేలు తలపెట్టి..!

మంచిర్యాలఅర్బన్: సంప్రదాయంగా వస్తున్న పండుగలను ప్రస్తుతం జరుపుకునే విధానంలో చేస్తున్న పొరపాట్లు పర్యావరణానికి ఎన్నో అనర్థాలు తెచ్చిపెడుతున్నాయి. వినాయక చవితి రోజు చేస్తున్న పొరపాట్లు చీకట్లు మిగుల్చుతున్నాయి. కానీ.. వినాయక చవితి అనగానే ఆకర్షణ, హంగు, ఆడంబరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొన్నేళ్లుగా రంగుల వినాయకులకు తీసిపోకుండా వివిధ రూపాలతో భక్తులను ఆకట్టుకునే విధంగా మట్టి గణపయ్యలను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కులవృత్తులు కాపాడుతూ.. ఉపాధినిస్తూ

కనుమరుగవుతున్న కులవృత్తిని కాపాడాలనే సదుద్దేశంతో మట్టి వినాయకుల తయారీతో పాటు ఎంతోమందికి ఉపాధినిస్తున్నారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన నాగపూరి రాజేంద్రప్రసాద్ మంచిర్యాలలోని సున్నంబట్టీవాడలో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ, ఎంకాం పూర్తి చేసిన ఆయన కులవృత్తితోపాటు పర్యావరణ పరిరక్షణకు ఆలోచన చేశారు. 2015లో ఏడు మట్టి విగ్రహాలు తయారీ చేసి విక్రయించారు. 2018లో 52 మట్టి ప్రతిమలను రూపొందించి పర్యావరణ హితానికి నడుం బిగించారు. ప్రస్తుతం శ్రీగణేష్ క్లే వర్క్ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. దాదాపు 80 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు.



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు

ముమ్ముందు దీపావళికి ఉపయోగించే ప్రతిమలు, ఇంట్లో వినియోగించే మట్టిపాత్రలు, కుండలు ఇలా అన్ని రకాలు తయారీ చేయాలని నిర్ణయించారు.

మట్టివిగ్రహాలతో ఆదాయం భళా..

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల తయారీ సరఫరా టెండర్ దక్కించుకున్నారు. 40వేల వినాయకులు సరఫరా చేయనున్నారు. మరోవైపు రెండో అన్నవరంగా పేరొందిన గూడేం సత్యనారాయణ టెంపుల్‌లో ఏర్పాటు చేసే మట్టి వినాయకుడు ఇక్కడే తయారు చేశారు. ఆదిలాబాద్ బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 2వేల మట్టి వినాయకుడు ఆర్డర్ ఇచ్చింది. ఎనిమిది నుంచి తొమ్మిది అడుగుల ఎత్తులో మట్టి వినాయకులు తయారు చేశారు. వినాయకుల తయారీలో కర్ర, మట్టి, గడ్డితో తడి సున్నం, వాటర్ కలర్‌లు వినియోగించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం పర్యావరణంతోపాటు కులవృత్తులను ప్రోత్సహించటానికి ప్రభుత్వ స్థలం లీజుకు ఇస్తే మరింత మందికి ఉపాధినిస్తానని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

తాతల కాలం నుంచి..

తాతల నుంచి వచ్చిన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని మట్టి వినాయకులు తయారీ చేసి ఆదర్శంగా నిలుస్తున్నాడు మంచిర్యాలకు చెందిన తాళ్లపల్లి తిరుపతి. ఇంటర్ పూర్తి చేసిన కులవృత్తి మట్టికుండల తయారీలో తర్ఫీదు పొందాడు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికుల సహకారంతో ఏటా 2వేల విగ్రహాలకు పైన మట్టి విగ్రహాలు తయారు చేసి ఆర్డర్‌పై ఇస్తుంటాడు. మూడు కుటుంబాలు మట్టి వినాయకుల తయారీలో పాలు పంచుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. చిన్న విగ్రహాలను చూడముచ్చటగా తీర్చిదిద్ది మార్కెట్లో విక్రయిస్తుంటా రు. మట్టికి సులువుగా కరిగే గుణం ఉంటుంద ని, విగ్రహాల తయారీలో చెరువు మట్టి వినయోగంతో పూడిక సమస్య తొలగిపోతందుని అందు కే మట్టికి ప్రాధాన్యం ఇస్తున్నామని తిరుపతి తెలి పారు. వినాయక చవితి పర్యావరణానికి పూర్తిగా మేలు చేసే పండుగని, మట్టితో పూజించాలని సూచించారు.



తిరుపతి తయారు చేసిన మట్టి విగ్రహాలు

పదిహేనేళ్లుగా తయారీ



రెడ్డి రమేశ్

చెన్నూర్: పర్యావరణ పరిరక్షణేలక్ష్యంగా పది హేనేళ్లుగా మట్టి విగ్రహాలు త యారు చేస్తున్నా. ప్రతియేటా వంద మట్టి విగ్రహాలు త యారు చేస్తుంటా. మట్టిని తీసుకొచ్చి స్వయంగా నెల రోజుల వరకు విగ్రహాలను తయారు చేస్తా. మట్టి ఖర్చులు తీసుకొని విగ్రహాలు ఇస్తాను. కొన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నా. ఇప్పటి వరకు మూడు ఫీట్ల ఎత్తు విగ్రహాలు చేస్తున్నా. రానున్న రోజుల్లో పది ఫీట్ల ఎత్తు విగ్రహాలు తయారు చేస్తాను.

క్లుప్తంగా

ఒకే ఈతలో రెండు దూడలు



కవల దూడలతో తల్లిగేదె

నిర్మల్‌ఖిల్లా: సర్వసాధారణంగా గేదెకు ఒకే దూడ జన్మించడం చూస్తుంటాం.. కానీ నిర్మల్ జిల్లా కేంద్రంలో మాత్రం గేదెకు ఒకే కాన్పులో రెండు దూడలు జన్మించిన అరుదైన సంఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నివాసముండే గిరిగంటి అనిల్ పశుపోషణ ద్వారా పాల కేంద్రం నిర్వహిస్తుంటాడు. ఇతని వద్ద ఉన్న గేదె బుధవారం తెల్లవారుజామున రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒకే ఈతలో రెండు దూడలు జన్మించడం అరుదైన విషయమని వందలలో ఒకటి రెండు శాతం మాత్రమే ఇలా జరుగుతాయని పశువైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. ట్విన్ ప్రెగ్నెన్సీ రావడానికి ప్రధానంగా హార్మోన్ల సంతులనం, గేదెకు మంచి పోషకాలతో కూడిన దాణ అందించడం కారణాలని అభిప్రాయపడుతున్నారు.

పాత నేరస్తుల బైండోవర్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నలుగురు పాత నేరస్తులను బుధవారం తహసీల్దార్ కృష్ణ ఎదుట బైండోవర్ చేసినట్లు టూటౌన్ ఎస్సై సీహెచ్ కిరణ్ కుమార్ తెలిపారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తుగా వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

తాత్విక'ముని'కి కీర్తి పురస్కారం



రాజారావు

నిర్మల్‌ఖిల్లా: ప్రముఖ తాత్విక కవి, రచయిత మునిమడుగుల రాజారావుకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది. ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాలను అందిస్తోంది. ఈ మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు బుధవారం పురస్కార వివరాలను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలం తంగళ్ళపల్లికి చెందిన రాజారావు యుక్తవయసునుంచే సాహిత్య పఠనం తాత్విక రచనల ద్వారా విశేషంగా పేరు గడించారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. అనాగరిక గేయం, నేను ఎవరు..?, దుఃఖ నది, హూ ఎమ్ ఐ, సత్యం వైపు పయనం వంటి అనేక రచనలతో సాహితీ రంగంలో తన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. పలు రచనలు ఆంగ్లంలోనికి అనువాదమయ్యాయి. గతంలోనూ తన రచనల ద్వారా అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో త్వరలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారంతో పాటు రూ.5,116 నగదు బహుమతి అందుకోనున్నారు.

'కాంగ్రెస్, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలు'



మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

ఇచ్చోడ: కాంగ్రెస్, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలని బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ నిషాని రాంచంద్రం ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కమిటీల పనితీరు, పార్టీ బలోపేతం విధివిధానాలను సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. 1950 నుంచి 93 వరకు బీసీలకు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల సతీశ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, స్టేట్ ఈసీ మెంబర్ మెస్రం జంగుబాబు, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అధ్యక్షులు జగన్, ముల్కల రాజేంద్రప్రసాద్, రత్నపురం రమేశ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, ఇటిక్యాల్ తాండ, పెంబి తాండ, తాటిగూడ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ గంగారెడ్డి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభిషేకర్ తెలిపారు. వారి వద్ద నుండి 20 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేష్, సాయి, రాజేందర్, రవీందర్, నిరోషా, రవి, అశ్వక్, జమీర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

గంజాయి విక్రేతల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ ఎదుట ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన షేక్ మసూద్, మహారాష్ట్రలోని బోకర్ తాలుకా చిక్కల్‌వాడికి చెందిన జుబేర్ ఫారుక్ పఠాన్ గంజాయి విక్రయిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్, సిబ్బంది సుధాకర్ రెడ్డి, వినాయక్, గోపాల్, నరేందర్, సంజీవ్, క్రాంతి అనుమానం వచ్చి వారిని విచారించారు. వారి వద్ద 243 గ్రాము ల ఎండు గంజాయి లభ్యం కావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ పరిధిలో గల శ్రీనివాస వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. ఐదుగురు వ్యక్తులు వైన్స్ వెనుక గల గోడకు కన్నం వేసి లోనికి ప్రవేశించేందుకు యత్నించారు. అదే సమయంలో అటుగా వచ్చిన పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పరారయ్యారు. పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన షేక్ బిలాల్, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మహ్మద్ షారుక్ ఖాన్‌లను పంజాబ్ చౌక్‌లో మంగళవారం పట్టుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గాదె రాజేశ్ (28) బుధవారం మంచిర్యాల, రవీంద్రఖని రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

భుజంపై వాగు దాటించి..




కెరమెరి మండలంలోని బోరిలాల్‌గూడకు చెందిన అంగన్‌వాడీ టీచర్ పవార్ కవిత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రికి వెళ్దామంటే ఇటీవల కురుస్తున్న వర్షాలకు మధ్యలో ఉన్న అనార్‌పల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఇంటివద్దే ఉంటోంది. బుధవారం జ్వర తీవ్రత పెరగడంతో సొమ్మసిల్లి పడిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఆమెను భుజంపై ఎక్కించుకుని అతికష్టం మీద వాగు దాటించారు. కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - కెరమెరి

ప్రకృతి ఒడిలో పాలధార

సొనాల మండలంలోని ఘన్‌పూర్ జలపాతం పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. వర్షాకాలపు కొత్తదనాన్ని నింపుకుని తన సమ్మోహన అందాలతో చూపులను కట్టిపడేస్తోంది. మహారాష్ట్ర సరిహద్దులో ఘన్‌పూర్ గ్రామానికి కిలోమీటరు దూరంలోనే పచ్చని ప్రకృతి ఒడిలో ఈ అద్భుత దృశ్యం దాగి ఉంది. పైనుంచి కిందకు జాలువారుతున్న జలధార చూపరులకు కనువిందు చేస్తోంది.

- బోథ్



బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఒకరి రిమాండ్

నేరడిగొండ: ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్న శేఖర్ అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం బాధితురాలు ఖానాపూర్ వద్ద గల గంగానదికి వెళ్ళిన సమయంలో సమీప బంధువైన శేఖర్ తన సెల్‌ఫోన్లో వీడియోలు తీశాడు. ఇటీవల వాటిని ఆమె భర్త స్నేహితుడికి వాట్సాప్‌లో పంపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.